ఢిల్లీకి మూటలు మోయడానికే మూసీ సుందరీకరణ..?

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రాంచంద్రారెడ్డి


మాట్లాడుతున్న రాంచంద్రారెడ్డి, అధికార ప్రతినిధులు

హయత్‌నగర్ : ఢిల్లీకి మూటలు మోయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ ఎత్తుకుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి ఆరోపించారు. సోమవారం మన్సూరాబాద్‌కు వచ్చిన ఆయన పార్టీ అధికార ప్రతినిధులు ఎన్వీ సుభాష్, రాణిరుద్రమ, బండారు విజయలక్ష్మి, సునితతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూసీ నిద్రపై పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు చేస్తున్న ఆరోపణలను వారు ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని అన్నారు. ఇన్ని రోజులు లేని ప్రేమ ఇప్పుడే ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఢిల్లీకి మూటలు మోయడానికి కాదా అని ప్రశ్నించారు. మూసీనదిలోకి మురుగునీరు రాకుండా మీరు చేసే ప్రణాళిక ఏమిటి, ఎన్ని ఎస్టీపీలు కట్టారు. ముందుగా అది తేల్చి సుందరీకరణ చేయాలన్నారు. 53 కిలోమీటర్లకు సుందరీకరణకు 1లక్ష 50వేల కోట్లు ఎలా ఖర్చు అవుతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడైన మూసీ ప్రజల సమస్యలు తెలుసుకున్నారా అని అడిగారు.

రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

అబ్దుల్లాపూర్‌మెట్ : బాటసింగారం రైతుసేవా సహకార సంఘంలోని రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ స్పష్టం చేశారు. సహకార సంఘం సభ్యుడైన బాటసింగారం గ్రామానికి చెందిన ఏనూరి గాలయ్య రెండు నెలల క్రితం మృతిచెందాడు. మృతిచెందిన రైతు కుటుంబానికి సహకార సంఘం ద్వార రూ.25వేల ఆర్థిక సా యం అందజేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం మృతుడి భార్య పొన్నమ్మ కు రూ.25వేలను సంఘం చైర్మన్ భరత్‌కుమార్ అందజేశారు. సంఘం డైరెక్టర్ మొగుళ్ల యాదిరెడ్డి, మేనేజర్ ఐలేష్‌యాదవ్, నాయకులు మూల కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.


రియాజ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

మొబైల్ ఫోన్ పక్కన పెట్టండి.. పుస్తకం చేతబట్టండి

- విద్యార్థులకు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ సూచన

సరూర్‌నగర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉజ్వల భవిష్యత్ నిర్మించుకోవాలనుకునే ఇంజనీరింగ్ విద్యార్థులు మొబైల్ ఫోన్ వాడకాన్ని దాదాపుగా తగ్గించుకోవాలని, నిరంతరం పుస్తకాలను చదువుతూ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ రియాజ్ సూచించారు. సోమవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం 'ఇంపాక్ట్ ఆఫ్ బుక్ రీడింగ్ ఫర్ అకాడమిక్ ఎక్సలెన్స్' అనే అంశంపై రియాజ్ మాట్లాడుతూ బీటెక్ విద్యార్థులు తమ రోజువారీ దినచర్యను పుస్తకాలతోనే ప్రారంభించాలని, మొబైల్‌ను పక్కనపెట్టాలని సూచించారు. కళాశాల కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి, హెచ్‌వోడీ డాక్టర్ గాయత్రి, ఫెసిలిటీ మేనేజర్ ప్రవీణ్, ఏవో దశరథరెడ్డి, లైబ్రేరియన్లు రమేశ్, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న విఠల్‌రెడ్డి

మీర్‌పేట్ 'నాగార్జున'లో స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

సరూర్‌నగర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్‌లోని నాగార్జున మాంటిసోరి ఐటీ ఒలింపియాడ్ స్కూల్‌లో వార్షిక క్రీడోత్సవాలు(స్పోర్ట్స్‌మీట్) సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నాగార్జున విద్యా సంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి జెండా ఊపి ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ క్రీడల్లో తర్ఫీదు ఇవ్వడానికి తాము ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అనుభవజ్ఞులైన శిక్షకులను ఏర్పాటు చేసి విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో విద్యా సంస్థల వైస్ చైర్మన్ రజనీవిఠల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డి.మహేశ్, ఇన్‌చార్జిలు దుర్గ, సంధ్య, ప్రశాంతి, రాధిక, పీఈటీలు లక్ష్మణ్, అశ్విని పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ప్రోకబడ్డీ పోటీలకు ఎంపిక

ఇటీవల గచ్చిబౌలి స్పోర్ట్స్ స్టేడియంలో నిర్వహించిన ప్రోకబడ్డీ(జూనియర్స్ విభాగం) రాష్ట్ర స్థాయి పోటీల్లో ఫైనల్‌లో విజయం సాధించి జాతీయస్థాయి పోటీలకు నాగార్జున స్కూల్ జట్టు అర్హత సాధించింది. ఈ క్రమంలో సోమవారం నాటి స్పోర్ట్స్ మీట్ సందర్భంగా సదరు జట్టులోని సభ్యులను చైర్మన్ విఠల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రజనీవిఠల్‌రెడ్డి తదితరులు అభినందించారు.

అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం

ఎల్బీనగర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీలో వేంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్ర నామార్చన నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రోచ్చరణల మధ్య స్వామి వారి కల్యాణం కనుల పండువగా జరిగింది. స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంతకు ముందు కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొరుపోలు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతిప్రసాద్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గండు ధనంరెడ్డి, కమిటీ ప్రతినిధులు శ్రీమన్నారాయణ, భోగేశ్వర్‌రావు, సుబ్బారావు, శ్రీనివాస్‌రావు, ప్రతాప్‌రెడ్డి, మహేందర్, ఆలయ సభ్యులు రవీందర్‌రావు, వీరేందర్‌రెడ్డి, కాలనీ కమిటీ సభ్యులు కనకరావు, మారోజు శ్రీనివాసచారి, సాయికిరణ్, అర్చకులు పాల్గొన్నారు.



మారుతీ సుజుకి డాజ్లింగ్ డిజైర్ కారును ఆవిష్కరిస్తున్న జబర్దస్త్ నటి వర్ష, కళ్యాణి మోటర్స్ సీఈఓ వెంకటేశ్వర్‌రావు, బ్రాంచి ఏజీఎం రాజ్‌కుమార్

మార్కెట్‌లోకి మారుతీ సుజుకీ డాజ్లింగ్ డిజైర్ కారు

కొత్తపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మారుతీ సుజికీ ఇండియా డాజ్లింగ్ డిజైర్ కారు హైదరాబాద్‌లో మార్కెట్‌లోకి విడుదల చేశారు. నగర శివారు ఎల్బీనగర్ కామినేని క్రాస్‌రోడ్‌లో మారుతీ సుజికీ ఎరినా కళ్యాణి మోటర్స్ షోరూమ్‌లో ఆదివారం జబర్దస్త్ నటి వర్ష ఆవిష్కరించారు. ఆమె కళ్యాణి మోటార్స్ సీఈఓ వెంకటేశ్వర్‌రావు, బ్రాంచి ఏజీఎం రాజ్‌కుమార్‌తో కలిసి మారుతీ సుజికీ డాజ్లింగ్ డిజైర్ అత్యాధునిక కారును మార్కెట్‌లోకి విడుదల చేసిన అనంతరం తొలి కొనుగోలుదారుకు డాజ్లింగ్ డిజైర్ నూతన మాడల్ కారు తాళం చెవులను అందజేశారు. ఇది బడ్జెట్ ఫ్రెండ్లీ కారు అని, లగ్జరీ ఫీచర్స్‌తో ఆధునిక సౌకర్యాలతో ఈ కారును డిజైన్ చేశారని వర్ష వెల్లడించారు. ఇది సరికొత్త మాడల్ కారు అనీ, బుకింగ్స్ కోసం వినియోగదారుల నుంచి మంచి స్పందన వస్తోందని సీఈఓ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మార్కెట్, వినియోగదారుల ఆధునిక సాంకేతిక, ట్రెండ్‌కు అనుగుణంగా రూపొందించిన ఈ కారు కొత్త బెంచ్ మార్కును సృష్టిస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రామాణికంగా 6 ఎయిర్ బ్యాగులు, ఫైవ్‌స్టార్‌సేఫ్టీ రేటింగ్ పొందిందని భద్రతకు ఆధునిక ఫీచర్స్ ఉన్నాయని పేర్కొన్నారు. మారుతీ సుజుకీ కార్లు బెస్ట్ మెయింటెనెన్స్ ఫ్రీ కార్లుగా నిలుస్తాయని వివరించారు. ఈ కొత్త మాడల్‌లో మైలేజీ మ్యాన్యువల్ ట్రాన్స్‌మిషన్ 24.79 కేఎంపీఎల్, సీఎన్‌జీలో 33.73 కేఎంపీఎల్, ఏజీఎస్‌లో 25.71 కేఎంపీఎల్ ఇస్తుందన్నారు.

ఇరుకిరుకు రోడ్డు..
వాహనదారుల పాట్లు!

- నాదర్‌గుల్ అంబేడ్కర్‌నగర్ మార్గంలో నిత్యం నరకం
- అక్కడే ఓ కార్పొరేట్ స్కూల్, ఏసీ కన్వెన్షన్ హాల్
- స్థానికులకు తప్పని తిప్పలు.. పట్టని అధికారులు



నాదర్‌గుల్ అంబేడ్కర్‌నగర్ రోడ్డులో ఎదురెదురుగా వచ్చిన వాహనాలు నిలిచిపోయిన దృశ్యం

సరూర్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేవలం రెండు వందల మీటర్ల నిడివి గల ఆ మార్గం దాటితే అణగారిన వర్గాల ప్రజలు నివసించే అంబేడ్కర్‌నగర్ బస్తీ.. ఆ బస్తీకి సమీపంలో ఓ ప్రముఖ కార్పొరేట్ స్కూల్, ఆ పక్కనే ఓ ఏసీ కన్వెన్షన్ హాల్. కానీ సదరు రెండు వందల మీటర్ల రోడ్డు దాటాలంటేనే వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. దానికి కారణం.. అది కేవలం 12అడుగుల వెడల్పుతో ఉండడమే! దాంతో ఈ మార్గంలోని వాహనదారులకు నిత్యం నరకం ఎదురవుతోంది. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ అంబేడ్కర్‌నగర్ రోడ్డులో పరిస్థితి ఇది!!

రోడ్డు ఎవరి పరిధి..

రికార్డుల ప్రకారం వెడల్పు ఎంత..?

నాదర్‌గుల్‌లోని జడ్పీ హైస్కూల్ నుంచి అంబేడ్కర్‌నగర్ మీదుగా బొంగ్లూరు సమీపంలోని ఆదిభట్ల రహదారి వరకు గతంలో బీటీ రోడ్డు నిర్మించారు. రోడ్డు మొత్తం దాదాపు 25అడుగుల వెడల్పుతో ఉండగా, సదరు రెండు వందల మీటర్ల నిడివి గల మార్గం మాత్రం కేవలం 12అడుగుల వెడల్పుతోనే ఉండడం గమనార్హం! దాంతో ఆ ప్రాంతానికి రాగానే వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. ఒకే వైపు నుంచి వాహనాలు వచ్చినప్పుడు ఇబ్బంది లేకపోయినా.. ఎదురెదురుగా వాహనాలు వస్తే మాత్రం ఎక్కడివక్కడ నిలిచిపోవాల్సిందే. కార్పొరేట్ స్కూల్ బస్సులు, ఏసీ కన్వెన్షన్‌కు వచ్చే వాహనాలు, ఆదిభట్లలోని టీసీఎస్‌కు వెళ్లే వాహనాలు, బొంగ్లూరు ఓఆర్ఆర్ వరకు వెళ్లే వాహనాలతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అలాంటి రోడ్డును అవసరమైనంత మేరకు విస్తరించాల్సి ఉండగా అధికారులు ఆ దిశలో ఎలాంటి చర్యలూ తీసుకోవడంలేదు. పైగా ఈ రోడ్డు పంచాయతీరాజ్ వాళ్లదా.. జిల్లా పరిషత్ వాళ్లదా.. ఆర్అండ్‌బీ వాళ్లదా.. అనే విషయంపై స్పష్టత లేకపోవడంతో విస్తరణ ఎవరి బాధ్యత అన్నది అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరోపక్క జడ్పీహైస్కూల్ నుంచి ఆదిభట్ల వరకు గల ఈ రోడ్డు రికార్డుల ప్రకారం ఎంత వెడల్పు అన్నది సైతం స్పష్టం కావడం లేదు. బడంగ్‌పేట్ మునిసిపల్ కార్యాలయంలో ఈ రోడ్డుకు సంబంధించిన వివరాలు లేకపోవడం గమనార్హం!

కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేదు..

అంబేడ్కర్‌నగర్ రోడ్డును వాహనాల రాకపోకలకు అనువుగా విస్తరించాల్సిందిగా కోరుతూ కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, నాదర్‌గుల్ 8వ డివిజన్ కార్పొరేటర్ గూడెపు ఇంద్రసేన ఇటీవల రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సైతం అందజేశారు. అయినా ఇంత వరకు దీనిపై అధికారులు దృష్టి సారించకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. ఈ రోడ్డు ఏ విభాగం పరిధిలోకి వస్తుంది.. దీని వెడల్పు ఎంత అనే విషయాలపై స్పష్టత ఇచ్చి ఆ మేరకు అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బాలాపూర్ స్కూల్‌లో టాయిలెట్స్ సమస్యను పరిష్కరిస్తాం

- బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి
- డిప్యూటీ మేయర్ శేఖర్‌తో కలిసి పాఠశాల సందర్శన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


బాలికలతో మాట్లాడుతున్న మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బాలాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో బాలికలు ఎదుర్కొంటున్న మూత్రశాలల(టాయిలెట్స్) సమస్యపై 'ఇంటికొచ్చేదాకా ఆపుకోవాల్సిందేనా!?' శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తా కథనానికి పాలకులు స్పందించారు. ఈ మేరకు సోమవారం బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌తో కలిసి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పర్యటించి మరుగుదొడ్ల పరిస్థితిని, పరిసరాలను పరిశీలించారు. అక్కడంతా అపరిశుభ్రంగా, అస్తవ్యస్తంగా ఉండడాన్ని గమనించారు. ముఖ్యంగా బాలికలు ఎదుర్కొంటున్న టాయిలెట్స్ సమస్యపై ఆరా తీశారు. స్వయంగా బాలికలతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. టాయ్‌లెట్స్ సరిగా లేనందున తాము ఇంటికెళ్లేదాకా మూత్ర విసర్జన చేయకుండా ఉంటున్నామని, మంచినీరు కూడా తాగడం లేదని బాలికలు వారికి వివరించారు. అనంతరం మేయర్ పారిజాతారెడ్డి మాట్లాడుతూ బాలాపూర్ స్కూల్‌లో త్వరలో మరుగుదొడ్ల నిర్మాణం పనులు చేపట్టి సమస్యను దూరం చేస్తామని పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని పాఠశాలల్లో టాయ్‌లెట్స్ సమస్యను పరిష్కరిస్తామని ఆమె చెప్పారు. డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టాయ్‌లెట్స్ నిర్వహణకు నిధులు కేటాయిస్తామని ఇటీవల ప్రకటించి చేతులెత్తేసిందని ఆరోపించారు. ప్రభుత్వం నిధులిస్తే టాయ్‌లెట్స్ సమస్య చాలామటుకు దూరమవుతుందని ఆయన అన్నారు. కార్పొరేషన్ తరఫున సైతం నిధులు కేటాయించాల్సిన అవసరం ఉన్నదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ జ్యోతీరెడ్డి, కార్పొరేటర్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు జైహింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- హయత్‌నగర్ డిపో జేఏసీ చైర్మన్ వెంకన్న



హయత్‌నగర్ డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

హయత్‌నగర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ సోమవారం హయత్‌నగర్ బస్ డిపో ఎదుట హయత్‌నగర్ 1,2 డిపోల కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హయత్‌నగర్ డిపో జేఏసీ చైర్మన్ ఆమనగంటి వెంకన్న మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రకటించిందని తెలిపారు. సంవత్సరం గడుస్తున్నా ఇంత వరకు చేయలేదని అన్నారు. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అన్నారు. 2021 వేతన సవరణను 30శాతం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2017 వేతన సవరణ బకాయిలను విడుదల చేయాలని కోరారు. వెల్‌ఫేర్ కమిటీలను రద్దుచేసి ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని కోరారు. అన్యాయంగా సస్పెండ్ అయిన ఉద్యోగులను తిరిగి డ్యూటీలోకి తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు కత్తుల యాదయ్య, సురేష్, సత్యపాల్, రాంరెడ్డి, మల్లేష్, అచ్చాలు, మూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు మెరుగుపరచాలి

- ప్రైవేటు హాస్పిటళ్ల దోపిడీని అరికట్టాలి: పీవైఎల్


ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు మెరుగు పరచాలంటూ రూపొందించిన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న భీమేశ్, రాకేశ్ తదితరులు

సరూర్‌నగర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఆస్పత్రుల ఫీజు దోపిడీపై దృష్టి సారించి పేదలకు అందుబాటు ధరల్లో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ డిమాండ్ చేసింది. అదే సమయంలో ప్రభుత్వ ఆస్పతుల్లో పేదలకు అవసరమైన అన్ని వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరింది. 'ప్రైవేటు ఆస్పత్రుల ఫీజు దోపిడీ-ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతుల మెరుగు' అనే అంశంపై పీవైఎల్ రూపొందించిన పోస్టర్లను సోమవారం బాలాపూర్ చౌరస్తాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవైఎల్ బాలాపూర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొల్లూరు భీమేశ్, కరమోల రాకేశ్ మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రుల యాజమన్యాలు ధనార్జనే ధ్యేయంగా టెస్టుల పేరుతో రోగుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు గుంజుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడమే దీనికి కారణమని వారు విమర్శించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతుల లేమి, అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం వల్లనే పేదలు అప్పులు చేసి మరీ ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించి కార్పొరేట్ వైద్యాన్ని ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోవాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవైఎల్ బాలాపూర్ మండల నాయకులు కొల్లూరు శంకర్, గంధమల్ల మహేశ్, కండ్లపల్లి నరేందర్, ఎస్.కుమార్, జి.రాంచందర్, పేట బాలు, శంకర్, దుంప వెంకటేశ్, ప్రవీణ్, ఎండీ అయాజ్, నరేశ్, మహేందర్ పాల్గొన్నారు.

బాలాపూర్ మండలానికి 30మంది విద్యా వలంటీర్లు

- కేఎల్లార్ ట్రస్ట్ ద్వారా నియమించి వేతనాలు ఇస్తాం
- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ వెల్లడి


జిల్లెలగూడ స్కూల్‌లో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న కేఎల్లార్

సరూర్‌నగర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నందున, ప్రభుత్వ టీచర్ల నియామకం జరిగే వరకు 30మంది విద్యా వలంటీర్లను కేఎల్లార్ ట్రస్ట్ ద్వారా నియమించి వేతనాలు ఇవ్వనున్నట్టు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి వెల్లడించారు. అదేవిధంగా త్వరలో లీడ్ ఇండియా, కేఎల్లార్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ స్కూళ్లలోని విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన పేర్కొన్నారు. సోమవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో గల చల్లా లింగారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో దళిత సంక్షేమ సమితి, గ్రేస్ ఫౌండేషన్, బంధు సొసైటీల ఆధ్వర్యంలో, దక్షిణ మధ్య రైల్వే మాజీ ఉన్నతాధికారి అప్పికట్ల భరత్ భూషణ్ ఆర్థిక సహకారంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్లేట్లు, గ్లాసులు, స్పూన్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేఎల్లార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరిస్తేనే అనుకున్న లక్ష్యాలను అందుకోగలుగుతారని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణ, కార్పొరేటర్లు గజ్జెల రాంచందర్, బైగల్ల బాలమణి, సిద్దాల మౌనికాశ్రీశైలం, చల్లా కవితాబాల్‌రెడ్డి, పోరెడ్డి పద్మాభాస్కర్‌రెడ్డి, పి.భిక్షపతిచారి, నాయకులు బి.గోవర్ధన్‌రెడ్డి, బి.ఓంప్రకాశ్, ఎస్.వరుణ్‌రెడ్డి, భరత్‌భూషణ్, ప్రకాశ్, పల్లెల వీరస్వామి పాల్గొన్నారు.

నాసిరకం అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై పోలీసుల దాడి


టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి శృతి ఆలేటి

చాదర్‌ఘాట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): చాదర్‌ఘాట్‌లోని మూసానగర్, వినాయకవీధి బస్తీలో కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. మూసానగర్, వినాయకవీధి బస్తీలోని ఓ ఇంట్లో కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఫుడ్ సేఫ్టీ అధికారి శృతి ఆలేటి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. నాణ్యత లేని అల్లం, వెల్లుల్లిని స్వాధీనం చేసుకున్నారు. అల్లం బదులుగా ఎక్కువ కాలం నిల్వ ఉండేందుకు ఎసిటిక్ యాసిడ్ మిక్స్ చేసి కల్తీ పేస్ట్ తయారు చేస్తున్నట్లు బయటపడింది. మురిగిపోయి కుళ్లిన వాసనతో కూడిన వెల్లుల్లి బస్తాలు బయటపడ్డాయి. వీటిని పేస్ట్‌గా తయారుచేసి అందులో అల్లంకు బదులు ఎసిటిక్ యాసిడ్ మిక్స్ చేసి మార్కెట్‌లో సరఫరా చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వీటి తయారీకి ఎలాంటి అనుమతులు కూడా లేవని ఫుడ్ సేఫ్టీ పర్మిషన్లు కూడా లేవని పోలీసులు తెలిపారు. ఇలాంటి కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌లు రుచిగా, మంచి వాసనను వెదజల్లినా వాటిని ఆహార పదార్థాల తయారీలో వాడి తిన్నవారికి విషంతో సమానమని ఫుడ్ సేఫ్టీ అధికారులు వివరిస్తున్నారు. ఇలాంటి కల్తీ తయారీ కేంద్రాలను గుర్తించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ వ్యాపారులపై పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి కల్తీ తయారీ కేంద్రాలపై స్థానికులు కూడా ఓ కన్నేసి గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రం నిర్వహిస్తున్న ఐదుగురిని సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించారు. కేసును చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

జనాభాకు అనుగుణంగా యూజీడీ పనులు చేపట్టాలి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జనాభాకు అనుగుణంగా అధికారులు యూజీడీ నిర్మాణ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్‌లోని బైరామల్‌గూడ ఓల్డ్ విలేజ్‌లో కొనసాగుతున్న నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రస్తుతం అధికారులు 8ఇంచుల పైపులతో డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నట్లు, వాటి స్థానంలో 12 ఇంచుల పైపులతో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయాశాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి యూజీడీ నిర్మాణంలో పైపుల సైజును పెంచాలని ఆదేశించారు. కాలనీలు, బస్తీలలో సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నట్లు అన్నారు. అధికారులకు ప్రజలు సహకరించి పనులు సజావుగా సాగే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోజు కృష్ణమాచారి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, నాయకులు బొంబాయి, రోజారెడ్డి, చీర శ్రీనివాస్, వసంత, కల్పన, అనసూయ, సత్తిరెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


జేసీబీతో పైపై కూల్చివేతలు చేపడుతున్న అధికారులు

హైకోర్టు మొట్టికాయలతో అధికారుల్లో కదలిక

- అయినా అంతంత మాత్రంగానే రోడ్డు కబ్జాచేసి కట్టిన నిర్మాణం కూల్చివేత
- పూర్తిగా కూల్చాలంటూ స్థానికుల డిమాండ్

వనస్థలిపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డును కబ్జా చేసి చేపట్టిన నిర్మాణంపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు హైకోర్టు మొట్టికాయలు వేయడంతో మేలుకొన్నారు. హయత్‌నగర్ డివిజన్ హుడాసాయినగర్ కాలనీలోని రోడ్డు నంబర్.5లో ఓ వ్యక్తి 150 ఫీట్ల రోడ్డులో 4ఫీట్ల వరకు ఆక్రమించి నిర్మాణం చేపట్టాడు. ఈ విషయమై స్థానికులు ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు కనీసం చలించలేదు. దీంతో కాలనీవాసులంతా సమస్యను హైకోర్టు దృష్టికి తీసుకెళ్లగా సదరు నిర్మాణాన్ని కూల్చివేయాలంటూ ఆర్డర్ వేసింది. కోర్టు ఆర్డర్‌తో స్థానికులు ప్రెస్‌క్లబ్‌లో కబ్జాకు సంబంధించిన వివరాలు, అధికారుల వైఖరిపై వివరాలు వెల్లడించడంతో అధికారుల్లో వెంటనే మెలుకువ వచ్చి సోమవారం కబ్జాకు గురైన పూర్తి స్థలాన్ని కాకుండా పైపైగానే కూల్చివేతలు చేపట్టారు. దీంతో స్థానికులు కబ్జా అయిన పూర్తి భాగాన్ని కూల్చాలంటూ డిమాండ్ చేస్తున్నారు. కోర్టు అర్డర్ వేసినా అధికారులు పూర్తి స్థాయిలో సదరు నిర్మాణాన్ని కూల్చకపోవడంలో ఆంతర్యం ఏమిటంటూ వారిపై పలు రకాల సందేహాలు, అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 18(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పాటు జరిగిన గ్రూప్-3 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తం 14 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. సోమవారం జరిగిన పరీక్షలకు 8,580 మంది అభ్యర్థులకు 4,809 మంది హాజరుకాగా, 3,771 మంది గైర్హాజయినట్లు అధికారులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చాదర్‌ఘాట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని చాదర్‌ఘాట్ పోలీసులు సోమవారం మలక్‌పేట మెట్రోస్టేషన్ సమీపంలో మూసానగర్‌లో గుర్తించారు. మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో హుటాహుటిన ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు 40ఏళ్ల వయస్సు కలిగి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు వారం రోజుల క్రితమే మృతిచెంది ఉండవచ్చన్నారు. మద్యం సేవించి స్పృహ కోల్పోయి ప్రాణాలు కోల్పోయాడా, లేక అనారోగ్యంతో మృతిచెందాడా, లేక ఇతర ఏమైనా కారణాలున్నాయా అనే వివరాలు మృతదేహానికి పోస్టుమార్టం చేసిన తర్వాత వెల్లడవుతుందని కేసు దర్యాప్తు చేస్తున్న చాదర్‌ఘాట్ ఎస్ఐ రవిరాజ్ తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి


తాటిచెట్టు వద్ద పడి ఉన్న శంకరయ్య మృతదేహం

అబ్దుల్లాపూర్‌మెట్: తాటిచెట్టుపై నుంచి జారి పడి గీత కార్మికుడు మృతిచెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్ పరిధిలోని బాచారం గ్రామానికి చెందిన అబ్బగోని శంకరయ్యగౌడ్(60) గీత కార్మికుడు. ఉదయం అతడు కల్లు తీసేందుకు తాటివనంలోకి వెళ్లగా అదే సమయంలో అతడి కుటుంబ సభ్యులు నగరానికి వెళ్లారు. కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి కింద పడ్డాడు. ఈ క్రమంలో తల, ముఖానికి తీవ్ర గాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. నగరం నుంచి తిరిగి ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులకు శంకరయ్య కనిపించకపోవడంతో అతడికి ఫోన్ చేస్తే ఎలాంటి సమాధానం రాలేదు. దాంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు శివారులోని తాటివనంలో వెతికారు. చాకలిబండ సమీపంలోని తాటిచెట్టు కింద తీవ్ర గాయాలతో శంకరయ్య మృతిచెంది కనిపించాడు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అక్కడికి చేరుకుని పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.